క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల నిరసన



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జంగారెడ్డిగూడెం: సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద ఎన్‌ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు యూనియన్ నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం గేట్ మీటింగ్ నిర్వహించారు. నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు చెల్లించాలని, 1/19 సర్క్యులర్ ప్రమాణాలు పాటించాలని, జీఓ 114లోని అలవెన్సులు అమలు చేయాలని, అర్హులకు ఏఏఎస్‌లు ఇంక్రిమెంట్ అరియర్స్ ఇప్పించాలనికోరారు. సర్వీసులో చనిపోయిన ఉద్యోగులకు అంత్యక్రియలకు రూ.25,000 ట్రెజరీ ద్వారా ఇప్పించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, ఏపీజీఎల్ఐ బిల్లులు, జీఐఎస్ బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జాయింట్ కార్యదర్శి టీయూపీ రావు, ట్రెజరర్ సీహెచ్‌ఏవీ ప్రసాద్, డిపో సెక్రటరీ డీవీఎస్ఎన్‌టీ రాజు, గ్యారేజ్ సెక్రటరీ టి.ఇశ్రాయేలులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆటోవాలాకు ఆర్థిక సాయం



రమణకు ఆర్థిక సాయం అందిస్తున్న ఆటోవాలాలు

కొయ్యలగూడెం: గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆటోవాలాకు కొయ్యలగూడెం ఆటోవాలాలు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. గుండె సంబంధిత వ్యాధితో శస్త్ర చికిత్స చేయించుకున్న విశాఖ జిల్లా గాజువాకకు చెందిన ఆటోవాలా ఉల్లి రమణకు కొయ్యలగూడెంకి చెందిన శ్రీ ఆల్ ఆంధ్ర మ్యాజిక్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు రూ.70 వేలు అందజేసి తమ ఉదారత చాటుకున్నారు. ఈ సందర్భంగా రమణ కుటుంబం ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపింది. కొయ్యలగూడెం మండల టాటా మ్యాజిక్ యూనియన్ ప్రెసిడెంట్ వెలగల ధనరాజు, శ్రీ లక్ష్మీ గణపతి టాటా యూనియన్ మ్యాజిక్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

చింతలపూడి: నేటి యువత క్రీడల్లో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. తొలుత డిగ్రీ కళాశాలలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ మురళీ కృష్ణ, టీడీపీ నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడిచేసిన ముగ్గురిపై కేసు

టి.నరసాపురం: వ్యక్తిపై దాడి చేసిన నేరంపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన మానికల గంగరాజు తన ఇంటి చుట్టూ గ్రీన్ క్లాత్ కట్టుకుంటున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మానికల లక్ష్మీనారాయణ, మానికల వెంకన్నబాబు, మానికల నాగులు గంగరాజుతో గొడవపడి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. గాయపడిన గంగరాజు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ఘనంగా వన మహోత్సవం

జంగారెడ్డిగూడెం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో, తహసీల్దార్ కార్యాలయం వద్ద వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బత్తిన లక్ష్మి, నాయకులు మొక్కలు నాటారు. లక్ష్మి మాట్లాడుతూ మానవ మనుగడకు అత్యంత ముఖ్యమైన వనరులు మొక్కలని, ప్రతి ఒక్కరూ మొక్క నాటి పరిరక్షించాలని సూచించారు. శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ పారిశ్రామికీకరణ నేపథ్యంలో అడవులు అంతరించిపోతున్నాయని, వాతావరణం కూడా కలుషితమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన గాలి, నీరు పొందాలంటే అటవీ ప్రాంతాన్ని పెంచుకోవాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అమ్మతరామయ్య, నాయకులు బత్తిన చిన్న, కౌన్సిలర్లు ఉగ్గం దుర్గాప్రసాద్, ఎల్‌వీఆర్, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. స్థానిక నవభారత్ లిమిటెడ్ పామాయిల్ కర్మాగారంలో జీఎం ఎం.అంజయ్య ఆధ్వర్యంలో కర్మాగారంలో 200 మొక్కలు నాటారు. పీఆర్‌ఓ ఏవీ రాఘవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వనమహోత్సవం

జంగారెడ్డిగూడెం రూరల్: ఎ.పోలవరం, పుట్లగట్లగూడెం, టెక్కినవారిగూడెం, గురవాయిగూడెం, వేగవరం, పట్టెన్నపాలెం, శ్రీనివాసపురం, పంగిడిగూడెం, పేరంపేట, చక్రదేవరపల్లి, అమ్మపాలెం, లక్కవరం, తిరుమలాపురం, నాగులగూడెం, నిమ్మలగూడెం, కేతవరం, అక్కంపేట, మైసన్నగూడెం, దేవులపల్లి, తాడువాయి పంచాయతీల్లో మొక్కలు నాటారు. ఎంపీడీఓ కె.విజయ్ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మైసన్నగూడెంలో సొసైటీ బ్రాంచిలో మొక్కలు నాటారు. పీఐసీ కె. గంగరాజు, సీఈఓ వై.సర్వేశ్వరరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కల పెంపకమే మార్గం

చింతలపూడి : మానవాళి మనుగడకు మొక్కల పెంపకమే మార్గమని వక్తలు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ డి ప్రమద్వార, డిప్యూటీ తహసీల్దార్ షకీలా మొక్కలు నాటారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఎక్సైజ్ ఎస్‌ఈబీ సీఐ డీఎస్ఎస్ ప్రసాద్ బాలికలతో కలిసి పండ్ల మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.జగ్గవరంలో..

టి.నరసాపురం: మండలంలోని కె.జగ్గవరం గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రహదారులకు ఇరువైపులా సుమారు 200 మొక్కలు నాటారు. ప్రతి ఇంటికీ మొక్కను అందజేసి, ట్రీగార్డ్స్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివమాధవి, లింగారెడ్డి నాగేశ్వరారవు, జయవరపు శ్రీను, బందలపాటి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం : జెడ్పీ బాలికల హైస్కూల్‌లో మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ తదితరులు



లింగపాలెం : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి



కొయ్యలగూడెం : గవరవరంలో మొక్క నాటుతున్న నాయకులు



పోలవరం రూరల్: గూటాలలో మొక్క నాటుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

కాలుష్యాన్ని నిర్మూలించాలి

లింగపాలెం: మొక్కలు నాటి కాలుష్యాన్ని నిర్మూలించాలన్న నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ఎంపీపీ మునునూరి వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఆమె మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం, ఈవోపీఆర్‌డీ రత్నకుమార్, వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత మునునూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

ఉద్యమంలా వనమహోత్సవం

కొయ్యలగూడెం: వనమహోత్సవాన్ని ఉద్యమంలా చేపట్టాలని గవరవరం మాజీ సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహారాజు పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద వనమహోత్సన్ని ఆయన ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏడీఏ పీజీ బుజ్జిబాబు ఆధ్వర్యంలో ఎంపీపీ గంజిమాల రామారావు మొక్కలు నాటారు. నరసన్నపాలెం వై.జంక్షన్ వద్ద నర్సరీని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పరిశీలించారు. కన్నాపురం అటవీ శాఖ రేంజర్ కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ చేశారు. అచ్యుతాపురం సర్పంచ్ ఎం.నాగలక్ష్మి, పరింపూడి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి ముప్పిడి విజయ్ కుమారి వనమహోత్సవం నిర్వహించారు.

ఘనంగా వన మహోత్సవం

కామవరపుకోట: అంకాలంపాడులో సర్పంచ్ చొక్కా స్వర్ణ, రావికంపాడు హైస్కూల్లో సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో వన సంరక్షణ సమితి సభ్యులు టీవీఎస్ రాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, కరుటూరు బాలస్వామి, గరిమల దివాకర్, నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ కనుమూరు అంజిరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

పోలవరం రూరల్: ప్రతి ఒక్కరూ మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి కోరారు. కొత్త పట్టిసీమ సచివాలయం వద్ద మైగాపుల విజయదుర్గ, పోలవరం పంచాయతీ, వైద్యశాలల్లో సర్పంచ్ పొడుం పుష్ప, పాఠశాలల్లో ఎంపీడీఓ జి.శ్రీనులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వలవల వరలక్ష్మి, కొణతాల ప్రసాద్, కరిబండి నాగరాజు, కార్యదర్శి వై.కొండలరావు, ఏపీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

కుక్కునూరు: సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి జిన్నెలగూడెంలో జిల్లా సెక్రటరీ మన్నవ కృష్ణ చైతన్య చేతుల మీదుగా గిరిజనులకు జామ, మామిడి రకాల 100 మొక్కలను పంపిణీ చేశారు.

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యకిరణ్

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం యు.వినోద్ అధ్యక్షతన నిర్వహించారు. సూర్యకిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రాష్ట్రంలో చాల మంది ఉద్యోగాలు కోసం వేలకు వేలు ఖర్చు పెట్టి కోచింగ్ లు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువకులు శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు వెళ్లాలన్నారు. రాజకీయ పార్టీల విధి విధానాలు వల్ల ప్రజలకు నష్టం ఏ రకంగా కలుగుతుందనే అంశంపై రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో ప్రియదర్శిని డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ తరగతులకు రాష్ట్ర నాయకులు, జిల్లాలోని ప్రధాన నాయకత్వం విద్యార్థి, యువతి, యువకులు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, నక్క వినయ్, డీవైఎఫ్ఐ నాయకులు పోతురాజు పాల్గొన్నారు.

కేసుల రాజీకి లోక్‌అదాలత్ చక్కని మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మధుబాబు

చింతలపూడి: కేసులను రాజీకి లోక్ అదాలత్ చక్కటి పరిష్కారమార్గమని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ సి.మధుబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. కోర్టులో పెండింగ్ కేసుల భారం ఎక్కువగా ఉందని, లోక్‌అదాలత్‌లో కేసులను రాజీ చేసుకునే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. చింతలపూడి కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్, కుటుంబ తగాదా, సివిల్ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. ప్రతి రోజు కోర్టులో జరిగే ప్రీ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకుని సమయం, ధనాన్ని ఆదా చేసుకోవాలని అన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి



తక్కెళ్లపాడులో ఆవుకు టీకా వేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు

ద్వారకాతిరుమల: గాలికుంటు వ్యాధి సోకకముందే రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నెహ్రూబాబు సూచించారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా 420 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో నెహ్రూబాబు టీకాల వేయించడం వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలో గాలికుంటు వ్యాధి టీకాలతో పాటు 4 నుంచి 6 నెలలు వయసు గల పెయ్యి దూడలకు బ్రూసెల్ల వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. బ్రూసెల్ల టీకా ఒక సారి వేయిస్తే జీవిత కాలం పనిచేస్తుందని వివరించారు. ఈ టీకాల కార్యక్రమం సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో భీమడోలు ఏడీ డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్, ద్వారకాతిరుమల మండల పశువైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, పశుసంవర్ధక శాఖ సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

కామవరపుకోట: రక్తదానం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుకావాలని అంతర్జాతీయ వాసవీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ పత్తి విశ్వనాథ్ కుమార్ కోరారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సంపత్ కుమార్ 303 సార్లు రక్తదానం చేసిన సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వారి బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షణలో 20 మంది రక్త దానం చేశారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పీవీఎస్ ఫౌండేషన్ సభ్యులు పాలడుగుల సురేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు చావ్వా రాంబాబు, కర్పూరం కృష్ణమూర్తి, బచ్చుముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

1న 'భిన్నంగా ఆలోచించు'పై శిక్షణ

జంగారెడ్డిగూడెం: స్థానిక పిరమిడ్ ట్రస్ట్ నిర్వహణలో సెప్టెంబర్ 1వ ఆదివారం భిన్నంగా ఆలోచించు అనే అంశంపై ఒకరోజు శిక్షణ నిర్వహిస్తున్నట్టు పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్షుడు కాకి రామకృష్ణ, కార్యదర్శి తటవర్తి కృష్ణ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక పిరమిడ్ అనుబంధ మైత్రేయ మందిరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. పీఎస్ఎస్ఎమ్ వ్యవస్థాపకుడు, చైర్మన్, ప్రముఖ రచయిత, గ్లోబల్ స్పిరిట్యువల్ స్పీకర్ ప్రకృతి ఉమా మహేష్ శిక్షణ ఇస్తారని తెలిపారు. భిన్నంగా ఆలోచించు పుస్తకం అందిస్తామని, మధ్యాహ్నం సాత్విక శాఖాహార భోజనం ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత దుర్గాప్రసాద్‌కు విరాళం బాండ్ పత్రం అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రాజమండ్రికి చెందిన వద్దిపర్తి దుర్గాప్రసాద్ దంపతులు శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. తొలుత వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విరాళం సొమ్మును ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నేత్రపర్వం.. పవిత్రారోహణం



పవిత్రాలతో ఉన్న శ్రీవారు

ద్వారకాతిరుమల: స్థానిక చినవెంకన్న ఆలయానికి దత్తత ఆలయమైన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం వర్షం కారణంగా ఆలయంలోనే పవిత్రారోహణను అర్చకులు నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత అర్చకులు దివ్య పవిత్రాలకు పూజలు చేశారు. వాటిని శ్రీవారి మూలవిరాట్‌పైనా, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లపైనా ఉంచారు. ఆలయంలో కొలువైన సుబద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు, ఆళ్వార్లపై ఈ పవిత్ర మాలలను వేశారు. యాగశాలలో పవిత్రాంగ హోమం, శాంతి హోమాలను నిర్వహించారు. శనివారం జరిగే పవిత్రావరోహణ, మహా పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

కోతకు గురైన సీసీ రోడ్డు



కోతకు గురైన బాపూజీ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డు

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని బాపూజీ కాలనీకి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు సగభాగానికి పైగా కోతకు గురైంది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏటిగట్టు నుంచి దిగువకు వెళ్లే మార్గంలో అడుగు భాగాన కల్వర్టు ఉంది. ఈ ప్రాంతంలో మొత్తం రోడ్డు సగానికి పైగా పగిలిపోవడంతో రాత్రి సమయంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సీసీ రోడ్డు కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



జంగారెడ్డిగూడెం విశేష అలంకరణలో గంగానమ్మ



కొయ్యలగూడెం: చింతలమ్మ ఆలయం వద్ద పారాయణ నిర్వహిస్తున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పట్టణంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గంగానమ్మ ఆలయంలో అమ్మవార్ని వివిధ చీరలు, పూలు, పత్రాలతో అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ముత్యాలమ్మ ఆలయంలో ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. విజయదుర్గమ్మ ఆలయంలో ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ అధ్వర్యంలో అమ్మవారికి పట్టుచీర, 50 కేజీల పసుపు కొమ్ములు, తులసిమాలలు, పువ్వులతో అలంకరించారు. ఈ అలంకరణకు మండవల్లి గౌరీ సముద్ర, మండవల్లి విజయసారధి (చిన్న సోంబాబు), దుర్గమ్మ దంపతులు ఆర్థిక సాయం అందించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. నూకాలమ్మ ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. అమ్మవారి వెండి చీర తయారీకి బోను అప్పలనాయుడు, నాగమణి దంపతులు 11 తులాల వెండి, గుబ్బల వెంకట సత్య ప్రసాద్, రామలక్ష్మి దంపతులు 11 తులాల వెండి అందజేసినట్టు ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు.

శ్రావణ శుక్రవారం పూజలు

కొయ్యలగూడెం: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా కొయ్యలగూడెం, కన్నాపురం, గవరవరం, వై.జంక్షన్, బయ్యన్నగూడెం, యర్రంపేట, రాజవరం, పొంగుటూరు, అచ్యుతాపురం, దిప్పకాయలపాడు, గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.